క్లుప్తంగా

అభివృద్ధి, సంక్షేమానికి రాచబాట

మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్



తాడికొండ: అభివృద్ధి, సంక్షేమానికి రాచబాటలు వేసిన ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని మచిలీపట్నం పోర్టు ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ అన్నారు. తాడికొండ రావిచెట్టు నుంచి జయ భారత్ కాలనీ వరకు రూ.60 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఆయన ఆదివారం శంకుస్థాపన చేశారు. ఆయన వెంట సర్పంచ్ తోకల సరోజినీ, ఉప సర్పంచ్ ఉయ్యూరు వెంకటరెడ్డి, జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, సొసైటీ చైర్మన్ షేక్ నగీనా, మాజీ చైర్మన్ వంగా పోలారెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం అభివృద్ధి కావాలి



తాడికొండ: పాశ్చాత్య దేశాల్లో ఉన్న సనాతన ధర్మం భారత దేశంలో కూడా అభివృద్ధి కావాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కేంద్ర కార్మిక బోర్డు చైర్మన్ వల్లూరి జయప్రకాష్ నారాయణ అన్నారు. ఆదివారం తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సరిపూడి సాంబశివరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. బీజేపీ జెండాను ఆవిష్కరించారు. తన గురువు మాట ప్రకారం నడుచుకొని, ఉన్నత స్థానానికి చేరిన వ్యక్తుల్లో దీన్ దయాళ్ ఒకరు అని అన్నారు. బీజేపీ సాధించిన ప్రతి విజయం ఆయనకే చెందుతుందని, ఏకాత్మత, మానవ వాదం ఆయన సూచనలన్నారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య, నీరుకొండ లక్ష్మీ నారాయణ, కొమ్మినేని సత్యన్నారాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం నిర్మాణ పనుల పరిశీలన



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయం నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గంజి చిరంజీవి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గ ప్రజలందరికి అందుబాటులో ఉండే విధంగా తెనాలి ఫ్లై ఓవర్ పక్కనే కార్యాలయాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. రెండు మూడు రోజుల్లో కార్యాలయం ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు రాపాల శ్రీనివాసరావు, ఎంటీఎంసీ అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డి, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, మంగళగిరి మాజీ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం చేరిన రజకుల మహా పాదయాత్ర



తాడేపల్లిరూరల్: రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ తిరుపతి నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న మహా పాదయాత్ర ఆదివారం సీతానగరం చేరుకుంది. ఈ సందర్భంగా జాతీయ దోబీ సంఘ్ అధ్యక్షుడు నాగ మల్లేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. రజకులను ఎస్సీ జాబితాలో చేరుస్తామని గత 75 సంవత్సరాలుగా అన్ని రాజకీయ పార్టీలు చెబుతున్నాయని, కానీ ఇప్పటికీ అది అమలు కాకపోవడం విచారకరమన్నారు. తిరుపతి నుంచి విజయవాడ వరకు నిర్వహిస్తున్న పాదయాత్ర పూర్తి కావచ్చిందని తెలిపారు. ప్రతి రాజకీయ పార్టీ రజకులను ఎస్సీల జాబితాలో చేర్చే అంశాన్ని తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచాలన్నారు.

మరకత శివలింగానికి అభిషేకం

ఫిరంగిపురం: వేమవరం గ్రామ శివారులోని కోటి ఒక్క శివలింగాల క్షేత్రంలోని మరకత శివలింగానికి ఆదివారం భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాకాళేశ్వరుడికి నిర్వహించిన విశేష పూజల్లో పాల్గొని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మంగళగిరి మణిహారం.. చేనేత వస్త్రాలయం

- నేడు ప్రారంభోత్సవం
- ప్రగడ కోటయ్య చేనేత వస్త్ర వ్యాపార సముదాయంగా నామకరణం
- ముఖ్య అతిథిగా విచ్చేయనున్న ఎంపీ విజయసాయిరెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న చేనేత వ్యాపారులు



మంగళగిరిలో నిర్మించిన ప్రగడ కోటయ్య చేనేత వస్త్ర వ్యాపార సముదాయం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి అనగానే గుర్తుకు వచ్చేది.. చేనేత వస్త్రాలు. అలాంటి చేనేత వస్త్రాల వ్యాపారానికి దుకాణాలు లేక నివాసాల్లోను, చిన్న చిన్న దుకాణాల్లోనూ గుర్తింపు లేని ప్రాంతాల్లో వ్యాపారులు నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత చేనేతలకు గుర్తింపు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఎస్.ఆర్.ఐ. జంక్షన్ వద్ద చేనేత కార్మికుల వృత్తి చిహ్నమైన రాట్నంతో.. వస్త్రాలు చేస్తున్న చిహ్నాన్ని ఏర్పాటు చేసింది. చేనేత వస్త్రాల వ్యాపారానికి మంగళగిరి పట్టణంలోని నిడమర్రు రోడ్డులో విశాలమైన స్థలంలో భవన నిర్మాణానికి గతేడాది ఆగస్టులో శంకుస్థాపన చేశారు. ఆరు నెలల కాలంలో భవన నిర్మాణం పూర్తి చేశారు. నేడు ఆ భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్ ఆదివారం తెలిపారు. సుమారు రూ.6 కోట్ల వ్యయంతో 40 షాపులు ఏర్పాటు చేసి, ప్రతి బ్లాక్‌లోను లిఫ్ట్ సౌకర్యం, మౌలిక వసతులు కల్పించామని, ఈ భవనానికి ప్రగడ కోటయ్య చేనేత వస్త్ర వ్యాపార సముదాయంగా నామకరణం చేశామని వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి భవన సముదాయం ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగ ఎంటీఎంసీ పరిధిలో మంగళగిరిలో మగ్గాల మీద తయారు చేసిన వివిధ రకాల చేనేత వస్త్రాలు, పట్టుచీరలు, వ్యాపారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించనున్నట్లు ఆయన తెలిపారు. మంగళగిరిలో నిర్మించిన ప్రగడ కోటయ్య చేనేత వస్త్ర వ్యాపార సముదాయంపై చేనేత వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంగళగిరికే మణిహారం



మంగళగిరిలో నిర్మించిన ప్రగడ కోటయ్య చేనేత వస్త్ర వ్యాపార సముదాయం మంగళగిరికే మణిహారం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేనేతల కోసం ఇలాంటి మంచి పనులు చేయడం చాలా సంతోషించదగ్గ విషయం. చేనేత వ్యాపారులు ఒకే చోట ఉండడం వల్ల వర్తకులకు చాలా సులువుగా ఉంటుంది.

– ఫణిదపు ప్రసాదు, చేనేత, మంగళగిరి.

చేనేత వస్త్రాలకు మరింత గుర్తింపు



మంగళగిరి చేనేత వ్యాపారులకు వస్త్ర వ్యాపార సముదాయంతో ఎంతో గుర్తింపు వస్తుంది. మంగళగిరిలో చేనేత వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారు. వారు వస్త్రాలు కొనుగోలు చేయాలంటే ఇరుకు సందుల్లో వాహనాలు తిరగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యాపార సముదాయం అందరికీ ఉపయోగం.

– తాటిపర్తి బాలాజి, వస్త్ర వ్యాపారి, మంగళగిరి.

అందరికీ మంచిది



మంగళగిరిలో చేనేత వస్త్ర వ్యాపారుల కోసం నిర్మించిన భవనం వర్తకులకు, కొనుగోలుదారులకు ఎంతో లాభసాటిగా ఉంటుంది. అన్ని రకాల వస్త్రాలు ఒకేచోట లభిస్తాయి. నిడమర్రురోడ్డులో నిర్మించిన ఈ–షాపింగ్ కాంప్లెక్స్ ముందు భాగం ఆక్రమణలకు గురికాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కారంపూడి నరసింహారావు, వస్త్ర వ్యాపారి, మంగళగిరి.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత
- సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం



సచివాలయ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

పాములపాడు(తాడికొండ): సచివాలయ, రైతు భరోసా కేంద్రాలతో అర్హత ఉన్న ప్రతి ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. ఆదివారం పాములపాడు గ్రామంలో రూ. 61.08 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, డిజిటల్ లైబ్రరీలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసి.. తన పాలన నచ్చితేనే ఓట్లు వేయండి అని ధైర్యంగా చెప్పిన ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది ఒక్క వైఎస్ జగన్ మాత్రమేనన్నారు. అవినీతి, అధికారం కోసం పాకులాడే పార్టీలు, ఆ పార్టీలకు మద్దతిచ్చే ప్యాకేజీ పార్టీలకు రాష్ట్రంలో అడ్రస్ గల్లంతు కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, జెడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, ఎంపీటీసీ జొన్నకూటి శ్రీరామ్, సీనియర్ నాయకులు పరుచూరి నారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి ద్వారం ప్రతిష్ఠోత్సవం

మేడికొండూరు: మండల పరిధిలోని వరగాని గ్రామంలోని లూథరన్ చర్చిలో ప్రధాన ద్వారం ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం జరిగింది. వైఎస్సార్ సీపీ తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత పాల్గొన్నారు. ఫాస్టర్ కోరగాటి విజయరాజు ప్రార్థన చేసి ప్రతిష్ఠ గావించారు. అనంతరం ఎమ్మెల్యే సుచరితకు ఆశీస్సులను అందించారు. అలాగే తెలుగు బాప్టిస్టు చర్చిలో ఫాస్టర్ ఆలూరి మాణిక్యరావు ఆశీర్వాదాన్ని అందుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఆమె వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న యార్లగడ్డ వెంకటేశ్వరరావు

తాడేపల్లిరూరల్ : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, పసుపు రైతు సంఘాల ఆధ్వర్యంలో సోమవారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని పసుపు రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి. జమలయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దుగ్గిరాల కోల్డ్ స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగి, బాధిత రైతులకు రూ.100 కోట్ల నష్టం వాటిల్లిందన్నారు. ప్రమాదంలో నష్టపోయినరైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు జవ్వాది సాంబశివరావు, గోహర్ జానీ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీలపై టీడీపీది కపట ప్రేమ

తాడేపల్లిరూరల్ : ముస్లిం మైనార్టీలపై తెలుగుదేశం పార్టీ కపట ప్రేమ చూపిస్తోందని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని విమర్శించారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలోని ముర్తుజానగర్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీజేపీతో పొత్తు కోసం చంద్రబాబు నాయుడు తహతహ లాడడం అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఏపీలో 2198 మసీదులు ఉన్నాయని, ఒక్కో మసీదులోని మౌజన్, ఇమామ్‌లకు ఏటా రూ.1.98 లక్షలు గౌరవ వేతనం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇస్తున్నారని తెలిపారు. ముస్లిం మైనార్టీలు వైఎస్ జగన్ వెంటే ఉంటారని స్పష్టం చేశారు.

జూదరుల అరెస్ట్

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల ఎస్ఐ ప్రతాప్‌కుమార్ రేవేంద్రపాడు, శృంగారపురం పంట పొలాల్లోని డొంక రోడ్లలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో తనిఖీలు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కోడి పందేలు నిర్వహిస్తున్న ఆరుగురుని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.1,2050లను, ఒక కోడి పుంజును, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేదలకు ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శివప్రసాద్

తెనాలిటౌన్: పట్టణ రజకపేటలోని రజక ఐలమ్మ పార్క్‌లో వాకర్స్ అసోసియేసన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అమ్మ హాస్పిటల్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో వైద్యులు డాక్టర్ శివప్రసాద్‌బాబు, డాక్టర్ శ్రీవిద్య, డాక్టర్ రాకేష్, డాక్టర్ జశ్వంత్‌లు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. షుగర్, రక్త పరీక్షలు, బీపీ, ఎముకల వ్యాధికి సంబంధించిన పరీక్షలతో పాటు పిల్లలకు, స్త్రీలకు వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేసన్ అధ్యక్షులు డాక్టర్ శివప్రసాద్, గౌరవ అధ్యక్షుడు మునిపల్లి ప్రసాద్, ఉపాధ్యక్షులు పులిగుజ్జు అర్జునరావు, సెక్రటరీ వంగర శివనాగేశ్వరరావులు పాల్గొన్నారు.

గాయకుడు ఘంటసాలకు నివాళులు

భట్టిప్రోలు: గాన గంధర్వుడు ఘంటసాల వెంకటేశ్వరరావు పాటలు అజరామరమని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం భట్టిప్రోలులోని స్ఫూర్తి స్థల్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఘంటసాల వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వివేకానంద విగ్రహ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సభ్యులు బండారు శ్రీనివాసరావు, ఆర్ సత్యన్నారాయణ మూర్తి, కె.నాగరమేష్, జంజనం హేమశంకరరావు, తిరువీధుల వెంకటేశ్వర్లు, వంగర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల అర్బన్: ఘంటసాల 50వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక ప్రాంతీయ శాఖ, యువజన కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో బాపట్లలోని ఘంటసాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఘంటసాల యువజన కమిటీ అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల పాట అజేయమని ఎల్లప్పుడూ ఆయన పాటలు అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు బ్రహ్మారెడ్డి, శంకర్, సుభాని, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు శూన్యం

జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్



తాడేపల్లిరూరల్ : విద్యను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు శూన్యమని జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ అన్నారు. ఆదివారం చిన కాకాని షైన్ ఆనంద శరణాలయాన్ని ఆయన సతీసమేతంగా సందర్శించారు. ఈ సందర్భంగా రవికాంత్ మాట్లాడుతూ విద్యార్థులు గురువులను, పెద్దలను గౌరవిస్తూ క్రమశిక్షణతో విద్యాభ్యాసం కొనసాగించాలన్నారు. బాలబాలికలకు పండ్లు, స్వీట్లు అందజేశారు. శరణాలయానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. రవికాంత్ దంపతులను శరణాలయం నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. గుంటూరు–1 డిపో సూపరింటెండెంట్ బి. బాలునాయక్, షైన్ ఫౌండేషన్ చైర్మన్ డీజీ నాయక్, నిర్వాహకులు సంధ్యారాణి, పి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచం గర్వించదగ్గ మేధావి అంబేడ్కర్

- ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సుచరిత
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యేసుచరిత, దయాసాగర్ తదితరులు

తాడికొండ: ప్రపంచ గర్వించదగ్గ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే, తాడికొండ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేకతోటి సుచరిత అన్నారు. తాడికొండ ప్రధాన రహదారి పోలీసు స్టేషన్ కొడాలి వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహ మహోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో లతరాజా ఫౌండేషన్ అధ్యక్షులు కెకె రాజా విగ్రహాన్ని ఆవిష్కరించగా, విశ్రాంత ఐఏఎస్ అధికారి గ్యారా రవిబాబు, మచిలీపట్నం పోర్టు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ ఎమ్మెల్యే సుచరితతో కలిసి గజమాలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సమానత్వం, సమ సమాజ స్థాపనకు అంబేడ్కర్ వేసిన బాటలు 75 ఏళ్ల పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనసాగుతుండటనే ఆయన రచన ప్రవీణ్యానికి నిదర్శనమన్నారు. బాబా సాహెబ్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని, సమాజంలోని అసమానతలను తొలగించి అందరికి సమాన హక్కులు కలిగేలా పాటుపడాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులను విగ్రహ కమిటీ సభ్యులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా, గ్రామ సర్పంచ్ తోకల సరోజిని, జెడ్పీటీసీలు గుడిమెట్ల జ్యోతి, దాసరి కథైరెనమ్మ, సోషల్ డెమోక్రసీ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మాదిగాని గురునాథం, ఇంటర్నేషనల్ ఫోర్డ్ ఫెలో అమెరికా అధ్యక్షులు ఎస్.సిగ్గోజిరావు, జాయింట్ రిజిష్టర్ ఏఎన్‌యూ రిటైర్డ్ మైలా మత్తయ్య, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బుర్రా వెంకటేశ్వరరెడ్డి, విగ్రహ కమిటీ అధ్యక్షుడు కె.ఆనందరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

తాడేపల్లిరూరల్ : ముస్లింలను గుర్తించిన రాజకీయ పార్టీల వెంటనే నడవాలని మంగళగిరి 6వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ మొహమ్మద్ రఫీ అన్నారు. ఆదివారం మంగళగిరి పట్టణ పరిధిలోని 29 వార్డులో ముస్లిం మైనార్టీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటూ రాజకీయంగా చైతన్యవంతులవ్వాలన్నారు. పట్టణంలో ఉన్న ముస్లిం మైనార్టీలను రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయని, తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. గతంలో ముస్లిం సోదరులు మున్సిపల్ వైస్ చైర్మన్ పదవి చేశారని గుర్తుచేశారు. ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయ పార్టీలకు ముస్లిం మైనార్టీలు గుర్తుకు వస్తారని విమర్శించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముస్లిం సోదరులు ఐక్యంగా ఉండి, ముస్లిం,మైనార్టీల సంక్షేమానికి, రాజకీయ ప్రాధాన్యతకు, సంస్థ అభివృద్ధికి కృషి చేస్తామన్న పార్టీల వెంటే నడవాలన్నారు.

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళులు



కృష్ణ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఆదిశేషగిరిరావు, నాదెండ్ల మనోహర్

తెనాలి: సూపర్‌స్టార్ కృష్ణగా ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న తన సోదరుడు, సినీనటుడు కృష్ణ గ్రామాభివృద్ధిని, ప్రజల శ్రేయస్సును కాంక్షించేవారని సినీ నిర్మాత, పద్మాలయా స్టూడియోస్ అధినేత జి.ఆదిశేషగిరిరావు అన్నారు. సినీ హీరో సూపర్‌స్టార్ కృష్ణ స్వస్థలమైన బుర్రిపాలెంలో కృష్ణ మెమోరియల్ ట్రస్ట్ భవన నిర్మాణానికి ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు, పద్మాలయా స్టూడియోస్ ఆధ్వర్యంలో గ్రామంలోని కళ్యాణ మండపంలో హీరో కృష్ణ సంస్మరణ సభను నిర్వహించారు. కృష్ణ సోదరుడు ఆదిశేషగిరిరావు మాట్లాడుతూ.. 60 ఏళ్ల కిందట సినిమా అవకాశాల కోసం ఒంటరిగా మద్రాస్ వెళ్లిన కృష్ణ, తెలుగు సినీరంగంలో తారా పథానికి చేరుకున్న వైనాన్ని గుర్తు చేశారు. బుర్రిపాలెం, తెనాలి ప్రాంత వాసులు ఎందరికో ఉపాధిని కల్పించారని చెప్పారు. ఎన్నారైలు ఏ దేశంలో ఉంటున్నా, సొంత గ్రామాలకు రావాలి..గ్రామాలు అభివృద్ధి చెందాలని కోరుకునేవారని చెప్పారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. సూపర్‌స్టార్ కృష్ణ సోదరులు ఆదర్శంగా ఉంటూ స్వగ్రామంలో మార్పుకు ప్రయత్నం చేస్తుండటం గర్వకారణమన్నారు. సినీ రంగంలో కృష్ణ ఒక పరిశ్రమగా ఎదిగి కొత్త టెక్నాలజీలను తీసుకొచ్చారని చెప్పారు. ఎన్నారై పెమ్మ సాని చంద్రశేఖర్ మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణకు కష్టపడటం మినహా మరేమీ తెలియవన్నారు. బుర్రిపాలెం కీర్తి దేశాంతరాలు దాటిందంటే అందుకు కృష్ణ కారణమన్నారు. మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది రాఘవరావు, కృష్ణ అభిమాన సంఘాల నేతలు మాట్లాడారు. డాక్టర్ కోనేరు సుధీర్‌కుమార్, ఘట్టమనేని వరప్రసాద్, ఘట్టమనేని నరసింహారావు, బాబి, పెమ్మ సాని జయప్రకాష్, శాఖమూరి కిశోర్, ఘట్టమనేని శేషగిరిరావు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కృష్ణ అభిమాన సంఘాల నేతలు పాల్గొన్నారు.

కళ్లజోళ్లు పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి పట్టణ పరిధిలోని రామనాథం చిన్నకోటయ్య శివపార్వతమ్మ వృద్ధుల సేవా ఆశ్రమంలో ఆదివారం 105వ నేత్ర పరీక్ష శిబిరం నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు రామనాథం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నేత్ర పరీక్షలు ఉచితంగా చేశామని, 50 మందికి ఉచితంగా కళ్లజోళ్లు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, బీసీ సంక్షేమ సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షుడు తిరువీధుల కిరణ్, విజయ చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ కాగితల స్వాతి, రవితేజ ట్రేడర్స్ అధినేత విట్టంశెట్టి నాగ కోటేశ్వరరావు, పిరమిడ్ మాస్టర్ దీపాల సాంబశివరావు పాల్గొన్నారు.

పంట పశువులార్పణం

తాడేపల్లిరూరల్ : విద్యుత్ మోటారు దొంగలు, పంట పొలాలను నాశనం చేస్తున్న పశువుల మందతో రైతులు లబోదిబో మంటున్నారు. ఆదివారం తెల్లవారుజామున పెనుమాక పంట పొలాలను వెంకటపాలెం, మందడం నుంచి పాడి పశువుల మంద ధ్వంసం చేశాయి. సుబ్బారావు అనే రైతు తన ఎకరం పొలంలోని మొక్క జొన్న పంటను రూ.90 వేలకు విక్రయించాడు. రెండు రోజుల్లో పంటను కోయాల్సి ఉండగా..పశువులు కండెల వరకు 80 శాతం తినేశాయి. ఆ పక్కనే అంజిరెడ్డి అనే కౌలు రైతు ఎకరం అరటితోటలో గెలవేసిన చెట్లను కొమ్ములతో పొడిచి వేయడంతో పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇలా సుమారు 30 ఎకరాల్లో పంటను పశువులు నాశనం చేశాయని రైతులు చెప్పన్నారు. పశువులను బంధిస్తే వాటి యజమానులు తమపై దొంగతనం కేసులు పెడుతున్నారని, తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, పంట చేతికొచ్చే సమయానికి పశువులు ఇలా నాశనం చేస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్ట్



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పాత జాతీయ రహదారి వెంబడి నులకపేట సుందరయ్య నగర్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని తాడేపల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ రమేష్ వివరాల ప్రకారం నులకపేట సుందరయ్యనగర్‌లో పుల్లారావు అనే వ్యక్తి అక్రమంగా మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో అతని ఇంటిని తనిఖీ చేశామన్నారు. అతని నివాసంలో 250 క్వార్టర్ బాటిళ్లు లభించడంతో పుల్లారావును అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు.